క్లుప్తంగా

సన్మానం



ఖానాపురం : ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్న నేపథ్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రఘుపతిని మండలంలోని మంగళవారిపేటకు చెందిన నాయకులు పైండ్ల యాదగిరి ఆధ్వర్యంలో గురువారం శాలువాతో సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు లావుడ్య రమేశ్, భూషబోయిన రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో..



వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని క్రీడాపోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఖమ్మంపాటి ఎల్లయ్య, యాకమ్మ స్మారకార్థం రూ.15 వేలు విలువైన బహుమతులు అందజేసిన రాధిక, రఘువీర్‌లను గురువారం సన్మానించారు. అనంతరం సన్మాన గ్రహీతలు మాట్లాడారు. పాఠశాలలకు అవకాశం ఉన్న వ్యక్తులు తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో బత్తిని సురేశ్‌కుమార్, టీచర్ హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

సాధనాసురుల విన్యాసాలు



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లిలో సాధనాసురులు గురువారం విన్యాసంతో అలరించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో విన్యాసాలు నిర్వహించగా సాధనాసురులు గ్రామస్తులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గజవెల్లి అనంతప్రసాద్, సంఘం అధ్యక్షుడు గద్దం నర్సింహారావు, నాయకులు గజవెల్లి సోమయ్య, ఆడెపు వెంకటేశ్వర్లు, గజవెల్లి భిక్షపతి, గజవెల్లి రామశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కుర్చీలు బహూకరణ



నర్సంపేట : పట్టణంలోని నాల్గో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రీ స్కూల్ విద్యార్థుల కోసం పెరుక ఉపేందర్ జ్ఞాపకార్థం అతడి సతీమణి కరుణ గురువారం 10 కుర్చీలు బహూకరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ నల్ల భారతి మాట్లాడారు. ఇదే కేంద్రంలో ప్రీ స్కూల్ పిల్లల కోసం గతంలో దాతల సహకారంతో 30 కుర్చీలు సేకరించినట్లు తెలిపారు. కరుణ 10 కుర్చీలు బహూకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శోభ, ఉపాధ్యాయులు రవీందర్, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్ గౌసియా, ఆయా సునీత, పిల్లలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చెన్నారావుపేట : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. లింగాపురం గ్రామానికి చెందిన అంకూస్ (47) ఈనెల 19న రోడ్డు ప్రమాదంలో గాయపడగా వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ క్రమంలో అంకూస్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య ముంతాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

వర్ధన్నపేట : పట్టణంలో గురువారం చోటు చేసుకున్న రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన జూపెల్లి గణేశ్, తాటికాయల రమేశ్ బైక్‌పై కొత్తపెల్లి వెళ్లే రోడ్డు నుంచి వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపైకి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో వారి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో గణేశ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. అలాగే పట్టణంలోని డీసీ తండా పరిధిలోని బావనికుంటతండాకు చెందిన జాటోతు దేవేందర్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై రైస్ మిల్లు సమీపంలో మరో ఆటో అతడి వాహనాన్ని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో దేవేందర్ కు కాలు విరిగింది. ఇద్దరినీ స్థానికులు ఆస్పత్రులకు తరలించారు.

యథేచ్ఛగా మొరం దందా

- రాత్రివేళల్లో తరలిస్తున్న వైనం
- కొందరు అధికారుల కనుసన్నల్లోనే..!

సంగెం : మండలంలో యథేచ్ఛగా మొరం దందా సాగుతోంది. రాత్రివేళల్లో తరలిస్తూ మాఫియా సొమ్ము చేసుకుంటోంది. కొందరు అధికారుల కనుసన్నల్లోనే తరలిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని షాపూర్ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌కు ఇరువైపులా ఉన్న మొరంను హిటాచి, జేసీబీలతో తవ్వుతూ టిప్పర్ల ద్వారా వరంగల్, ఇతర ప్రాంతాల్లోని వెంచర్లకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. గ్రామస్తులు ఇళ్ల నిర్మాణ అవసరాలకు మొరం తరలిస్తే కేసులు పెడుతున్న అధికారులు నిబంధనలకు విరుద్ధంగా మొరం దందా సాగుతుండగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. కొద్ది నెలలుగా కొందరు అధికారుల కనుసన్నల్లోనే మొరం తరలింపు జరుగుతోందని సమాచారం. మొరం తరలించడంతోపాటు వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ పచ్చని చెట్లను సైతం నెలకూల్చుతున్న దుస్థితి నెలకొంది. కెనాల్ గట్టుకు ఇరువైపులా మొరం తరలిస్తుండడంతో ఆ ప్రాంతంలోని కొందరు రైతులకు ఎకరాల కొద్ది భూమి సాగులోకి కలిసొస్తుండంతో మాఫియాతో చేతులు కలిపినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంకొందరు తమ వ్యవసాయ భూమికి పక్కనున్న మొరం తరలింపునకు తోడ్పాటు అందిస్తూ డబ్బులు తీసుకుంటున్నారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని షాపూర్ మోడల్ గ్రామంగా ఎంపికవగా 124 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా ఇళ్లకు అవసరమైన మొరం ఎక్కడ నుంచి తేవాలంటూ గ్రామ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు అక్రమ మొరం దాందా అరికట్టి మాఫియాపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. వివరణ కోసం ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రాలేదు.



మొరం తవ్విన ప్రాంతం



తవ్వకానికి వినియోగిస్తున్న జేసీబీ, టిప్పర్లు

పోస్టల్ బీమాతో ప్రయోజనాలు



బీమా చెక్కును అందజేస్తున్న సుచేందర్, సంపత్, తదితరులు

- సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుచేందర్

నర్సంపేట : పోస్టల్ బీమా పాలసీలతో తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని ఆ శాఖ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుచేందర్, ఐపీపీబీ మేనేజర్ సంపత్ తెలిపారు. చెన్నారావుపేట మండలానికి చెందిన నలమాస వెంకటేశ్వర్లుకు మంజూరైన రూ.9 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి సుచేందర్, సంపత్ స్థానిక పోస్టాఫీస్‌లో గురువారం అందజేసి మాట్లాడారు. వెంకటేశ్వర్లు రూ.520 చెల్లించి రూ.10 లక్షల ప్రమాద బీమా పాలసీ తీసుకున్నాడని చెప్పారు. వెంకటేశ్వర్లు ప్రమాదంలో గాయాలపాలై 90 శాతం పక్షవాతానికి గురి కాగా రూ.9 లక్షల బీమా మంజూరైందని తెలిపారు. పోస్టల్ ప్రమాద బీమా పథకాలు తీసుకున్న వ్యక్తులు ప్రమాదాల బారిన పడితే కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందుతుందని చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన పేదలు తక్కువ ప్రీమియం చెల్లించి రూ.10–15 లక్షల బీమా పొందవచ్చని వివరించారు. పోస్టల్ శాఖ అందిస్తున్న పథకాలను పేదలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట సబ్ పోస్ట్‌మాస్టర్ సురేశ్, ఐపీపీబీ ఉద్యోగులు సునీత, దివ్య, పోస్టల్ అసిస్టెంట్లు రాజన్, కోటేశ్వర్, ఎంటీలు వీరభద్రయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ యుద్ధభేరి సభకు మెపా మద్దతు



తీన్మార్ మల్లన్నతో పొన్నం రాజు, తదితరులు

నర్సంపేట : ఫిబ్రవరి 2న హన్మకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జగరనున్న బీసీ యుద్ధభేరి సభకు ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు బీసీ నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను హన్మకొండలోని ఓ హోటల్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు మాట్లాడారు. అనేక తరాలుగా కొన్ని సామాజిక వర్గాల చేతిలోనే పాలన మగ్గిపోతోందని ఆందోళన వెలిబుచ్చారు. బీసీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు మాట్లాడుతూ బీసీలను పాలకులు ఓటు బ్యాంకుగా మాత్రమే గుర్తించారని తెలిపారు. ఈడబ్ల్యూఎస్, క్రిమిలేయర్ పేరిట బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా చేశారని చెప్పారు. మండల్ కమిషన్ సిఫార్సు చేసిన 52 శాతం బీసీల వాటా ఉద్యోగ, ఉపాధి, రాజకీయాల్లో లేకుండా పోయిందన్నారు. రాజ్యాధికారంలో వాటా కోసం పోరాడడానికి ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, శ్యామ్, వినోద్, రామకృష్ణ, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు



నిందితుడు, గుడుంబా తయారీ సామగ్రితో అధికారులు, సిబ్బంది

ఖానాపురం : గుడుంబా తయారీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి, ఖానాపురం ఎస్సై రఘుపతి స్పష్టం చేశారు. మండలంలోని నాజీతండాలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి, స్థానిక ఎస్సై రఘుపతి మాట్లాడారు. 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతోపాటు వెయ్యి లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేసినట్టు తెలిపారు. నలుగురిపై కేసులు నమోదు చేశామన్నారు. గుడుంబాతో అనేక మంది జీవితాలకు నష్టం వాటిల్లుతున్నట్టు తెలిపారు. గుడుంబా తయారీని మానుకోకపోతే పీడీ యాక్ట్ నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు

ఖానాపురం : వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వీఓఏల మండల స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వీఓఏలు కనీస వేతనానికి నోచుకోవడం లేదని, అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. విపరీతమైన ఒత్తిడిలో విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. ప్రభుత్వం ఇకనైనా రూ.26 వేల చొప్పున కనీస వేతనం ఇవ్వాలని, మూడు నెలలకోసారి రెన్యూవల్ చేసే విధానాన్ని రద్దు చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్, బీమా, తదితర సౌకర్యాలు కల్పించాలని, ఆన్‌లైన్ డాటా ఎంట్రీ కోసం ప్రభుత్వమే ల్యాప్‌టాప్‌లు సరఫరా చేయాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకుడు పోలదాసరి రమేశ్, మండల అధ్యక్షుడు అల్లావుద్దీన్, స్థానిక నాయకులు కరుణ, సరోజన, శ్రీదేవి, నీరజ, మంజుల, రేణుక, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

వర్ధన్నపేట : పట్టణంలో పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన పొన్నం వేణు ఇంట్లో గురువారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి రూ.1.98 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.12 వేలు విలువైన వెండి వస్తువులు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బియ్యం, సరుకుల అందజేత

రాయపర్తి : మండలంలోని కొత్తూరుకు చెందిన బోనగిరి చంద్రయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం, సరుకులు గురువారం అందజేశారు. తొలుత చంద్రయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ మాట్లాడారు. మాజీ మంత్రి దయాకర్‌రావు సూచన మేరకు మండలంలోని పేద కుటుంబాలకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, మాజీ సర్పంచ్ కందికట్ల స్వామి, ఫౌండేషన్ ప్రతినిధులు యూసుఫ్, గజవెల్లి ప్రసాద్, రాము, సంకినేని ఎల్లస్వామి, కందికట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

సంగెం : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కందకట్ల నరహరి తల్లి లక్ష్మి గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, రాష్ట్ర నాయకుడు వరద రాజేశ్వర్‌రావు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, తదితరులు సైతం నివాళులర్పించారు. అనంతరం నరహరిని పరామర్శించారు.

పరామర్శ



పర్వతగిరి : కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు అత్త గుండారపు అమృతమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మండలంలోని శ్రీనగర్‌లో వర్ధన్నపేట, నర్సంపేట ఎమ్మెల్యేలు కేఆర్.నాగరాజు, దొంతి మాధవరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, తదితరులు గురువారం పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌డీఎఫ్ విద్యాసంస్థల అధినేత ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు, కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేశవాపురం, ఊకల్‌లో..

రాయపర్తి : మండలంలోని కేశవాపురం, ఊకల్ గ్రామాలకు చెందిన పలు కుటుంబాలను బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. తొలుత కేశవాపురంలో ఇటీవల మృతి చెందిన గాజుల వెంకన్న, దశారి నర్సయ్య, చిలుముల నర్సయ్య, ఊకల్‌లో బండపల్లి వెంకటయ్య కుటుంబాలను కలిసి ఓదార్చారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, కర్ర రవీందర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, బొడ్డు రంగయ్య, పున్నమయ్య, యాకయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘననివాళి

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా మహాత్మగాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలూ గురువారం ఘనంగా నివాళులర్పించారు. నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, పర్వతగిరి, సంగెం, రాయపర్తి, చెన్నారావుపేట, నెక్కొండ, తదితర మండలాల్లో మహాత్మాగాంధీ 77వ వర్ధంతి నిర్వహించారు. సంగెంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితోపాటు పలువురు పూలమాల వేసి ప్రసగించారు. పలు చోట్ల పండ్లు పంపిణీ చేశారు.



నర్సంపేట : విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సంగెం : పూలమాల వేస్తున్న ప్రకాశ్‌రెడ్డి

టీజీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజు



దుగ్గొండి : తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ (టీజీఆర్‌ఎస్‌ఏ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా మండలంలోని ముద్దునూరుకు చెందిన కోమాండ్ల రాజు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ జాక్ చైర్మన్ లచ్చిరెడ్డి, టీజీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి గురువారం రాజుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మీడియాతో మాట్లాడారు. రెవెన్యూ ఉద్యోగుల, అన్నదాతల సమస్యల పరిష్కారం కృషి చేస్తానని చెప్పారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా



నర్సంపేట : మండలానికి చెందిన గుర్రం అజయ్ పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఖమ్మంలో జరిగిన రెండు పీడీఎస్‌యూల విలీన సభలో రాష్ట్ర కమిటీ ఎన్నిక జరిగిన సందర్భంగా అజయ్ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా అజయ్ విలేకరులతో గురువారం మాట్లాడారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, తదితర విద్యార్థుల హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్మిస్తామని చెప్పారు.

సమాచార హక్కు చట్టం అధ్యక్షుడిగా..



ఖానాపురం : సమాచార హక్కు చట్టం–2005 మండల అధ్యక్షుడిగా మండలంలోని కొత్తూరుకు చెందిన నాంచారి కుమారస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు డివిజన్ అధ్యక్షుడు చెట్టుపెల్లి విజేందర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి విలేకరులతో మాట్లాడారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తానన్నారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వ కళ్లు తెరిపించు

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

సంగెం : కాంగ్రెస్ ప్రభుత్వ కళ్లు తెరిపించాలని కోరుతూ స్థానిక మహాత్మాగాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అసమర్థ, దద్దమ్మ, చేతకాని ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని, సీఎంకు జ్ఞానోదయం కలిగించాలని కోరారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు లేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 410 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతులకు భరోసా కల్పించేలా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి మండలంలోని పల్లారుగూడలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న బానోత్ తిరుపతి కుటుంబాన్ని సభ్యులు తన్నీరు హరీశ్‌రావు, తదితరులు పరామర్శించే కార్యక్రమం ఏర్పాటు చేయగా పోలీసు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎన్నికల కోడ్ సాకుగా చూపుతూ అనుమతి నిరాకరించారని చెప్పారు. కోర్టు అనుమతితో ఫిబ్రవరి 1న కమిటీ పర్యటన ఉంటుందని, బాధిత కుటుంబానికి భరోసా కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు సారంగపాణి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, కుమారస్వామి, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఇతర మండలాల్లో..

నర్సంపేట, వర్ధన్నపేట, చెన్నారావుపేట, ఖానాపురం, దుగ్గొండి, రాయపర్తి, తదితర మండలాల్లో గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రాలు అంజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. నిరసన తెలిపారు.

లక్కమారి కాపు సంఘం కార్యవర్గం ఎన్నిక



చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేటలో లక్కమారి కాపు కుల సంఘం కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుల పెద్దగా కూస కుమారస్వామి, అధ్యక్షుడిగా పెండ్లి కుమారస్వామి, ఉపాధ్యక్షుడుగా ఎరుకల రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కూస రవికుమార్, సభ్యులుగా కొనకటి రాజు, నవీన్, పెంతల రాజు, కూస రాజు, మధు పెండ్లి, సింగిరెడ్డి సురేశ్, మల్లయ్య, గూడ కుమారస్వామి, రమణారెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కూస వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు అనుముల కుమారస్వామి, కుల పెద్దలు కూస రాజయ్య, గూడ రాజిరెడ్డి, సింగిరెడ్డి ప్రతాప్, పెండ్లి ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



గీసుకొండ : మండల కేంద్రంలోని వేణు గోపాలస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి తెలిపారు. ఆలయ ఆవరణలో భూమి కొనుగోలుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను గురువారం ఆయన స్వీకరించి మాట్లాడారు. ఆలయం ఎదుట ఉన్న ఆడెపు భద్రయ్య కూతుర్ల భూమిని రూ.4 లక్షలకు కొనుగోలు చేశామని చెప్పారు. త్వరలో ఆలయం పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ చాడ సంజీవరెడ్డి, ప్రధాన అర్చకుడు వేదాంత నర్సింహాచార్యులు, కమిటీ సభ్యులు ఆడెపు లింగమూర్తి, రామా కుమారస్వామి, బండారు నరేందర్, ముల్క మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

మండలానికి మహిళా అఘోరి..



గీసుకొండ : మండంలోని వరంగల్–నర్సంపేట రహదారి మీద మచ్చాపూర్–దస్రుతండా నడుమ అపెక్స్ కళాశాల సమీపంలో మహిళా అఘోరి కారులో గురువారం కాసేపు ఆగింది. ఆమెను గుర్తించిన స్థానికులు కారు డోర్, విండో తీయాలని కోరగా బయటకు వచ్చి స్థానికులపై అసహనం వ్యక్తం చేసింది. తను అమ్మవారని, తనకు నిద్ర వస్తోందని చెప్పింది. అనంతరం స్థానికులపై విసుగుతో కొడతానంటూ కర్రతో బెదిరించింది. అఘోరిని చూడటానికి పలువురు ఆసక్తి చూపడంతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మచ్చాపూర్ మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్ గీసుకొండ పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి అఘోరిని అక్కడి నుంచి పంపించారు.